అండగా.. రైతుభరోసా కేంద్రాలు

- గ్రామస్థాయిలోనే రైతులకు మెరుగైన సేవలు
- అందుబాటులో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు
- కొనుగోలు కేంద్రాలుగా ఆర్‌బీకేలు
- వ్యవసాయం పండుగగా మారటంతో రైతుల హర్షం


గొడవర్రులో విత్తనాలు అందుకుంటున్న రైతులు


ప్రొద్దుటూరులో ప్రారంభానికి సిద్ధంగా ఆర్‌బీకే

కంకిపాడు: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలను అందుబాటులోకి తెచ్చినప్పటి నుంచి రైతాంగానికి భరోసా ఇస్తున్నాయి. బహిరంగ మార్కెట్‌లో దోపిడీకి గురికాకుండా అడుగడుగునా రక్షణగా నిలుస్తున్నాయి. వ్యవసాయం దండగ అన్న పరిస్థితి టీడీపీ హయాంలో ఉంటే.. వైఎస్సార్ సీపీ పాలన రైతులకు పండుగలా మారింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషితో అన్నదాతల్లో కొండంత ధైర్యం నెలకొంది.

కంకిపాడు మండలంలో..

పెనమలూరు నియోజకవర్గంలోని కంకిపాడు మండలంలో 18 సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 18 ఆర్‌బీకేలు ఉన్నాయి. మండలంలో 18,400 ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణం ఉంది. వరి, చెరకు, పసుపు, కూరగాయలు, కంద, తమలపాకు, ఇతర ప్రధాన పంటలు సాగవుతున్నాయి. గతంలో ఎరువులు కావాలన్నా, విత్తనాలు, పురుగు మందులు వేటి కోసమైనా మండలంలోని రైతులు కంకిపాడు, ఈడుపుగల్లు ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. విత్తనాలను రైతువారీగా సమకూర్చుకునేవారు. వ్యాపారులు నిర్ణయించిన ధరలకు కొనుగోలు చేసేవారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విత్తు నుంచి విక్రయం వరకు..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతుల అవస్థలన్నింటికీ చెక్ పడింది. రైతులకు శిక్షణ తరగతులుగా, విత్తు నుంచి విక్రయం వరకు సేవలు అందించడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలను అందుబాటులోకి తెచ్చారు. ఏ గ్రామానికి ఆ గ్రామంలోనే రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటి ద్వారా ఖరీఫ్, రబీ సీజన్‌లకు అవసరమైన విత్తనాలను, ఎరువులు, పురుగుమందులు అందుబాటులోఉన్నాయి. ఆర్‌బీకేల్లో ఉన్న కియోస్క్ యంత్రాల్లో రైతులు తమకు కావాల్సిన రాయితీలను వినియోగించుకుంటున్నారు. విత్తనాలను, ఎరువులను నమోదు చేసి రైతు డిమాండ్‌కు అనుగుణంగా 48 గంటల్లోనే అందిస్తున్నారు.

ఈయన పేరు కొడాలి మృత్యుంజయరావు. కౌలు రైతు. పునాదిపాడు గ్రామం. 2.50 ఎకరాల్లో సాగు చేస్తున్నాడు. గతంలో పంట పొలానికి అవసరమైన ఎరువులు, పురుగు మందులు మండల కేంద్రమైన కంకిపాడుకు వెళ్లి తెచ్చుకునేవాడు. కొందరు వ్యాపారులు వారిష్టానుసారం డబ్బులు వసూలు చేసిన పరిస్థితి ఉండేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు సేవలు మెరుగ్గా అందాలనే ఉద్దేశంతో రైతుభరోసా కేంద్రాలను (ఆర్‌బీకేలు) ఏర్పాటుచేశారు. గ్రామంలోనే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు సీజన్‌కు అనుగుణంగా అందుబాటులో ఉంటున్నాయి. ఎమ్మార్పీకే విక్రయిస్తున్నారు. నాణ్యమైనవి దొరుకుతున్నాయి. వ్యయప్రయాసలు తప్పాయి. ఆర్‌బీకేలతో ఉపశమనం దక్కుతుంది.



రైతు చెంతనే సేవలు

గతంలో ప్రతి చిన్న అవసరానికి మండల కేంద్రానికి పరుగులు తీయాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ పరిస్థితి మారింది. మండల కేంద్రానికి పరుగులు తీయకుండా గ్రామంలోనే తాము చేస్తున్న పంటల సాగు వివరాల నమోదు, సబ్సిడీలను లబ్ధిపొందడం, ఈ క్రాప్ నమోదు, ప్రకృతి విపత్తుల వేళ పంటల నమోదు అంతా గ్రామస్థాయిలోనే ఆర్‌బీకే ద్వారా సమకూరుతుంది. ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరకు పంటను కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధర అందిస్తూ రైతులకు భరోసా ఇస్తున్నాయి.

మండలంలో ఆర్‌బీకేలు	18
సాధారణసాగు విస్తీర్ణం	18,400 ఎకరాలు
రైతులు	7,750 మంది
రైతుభరోసా లబ్ధి పొందింది	4,881 మంది
లబ్ధి మొత్తం	రూ.28.60 కోట్లు
ఎరువులు, విత్తనాలు తీసుకుంది	3500 మంది
యంత్రపరికరాలు, పనిముట్లు పొందింది	95 మంది
లబ్ధి మొత్తం	రూ 2.85 కోట్లు
ఖరీఫ్‌లో ధాన్యం అమ్మింది	3,908 మంది
సేకరించిన ధాన్యం	36 వేల మెట్రిక్ టన్నులు
రైతులకు చెల్లించిన సొమ్ము	రూ.60.02 కోట్లు

సమకూరుతున్న భవనాలు

మండలంలోని 18 ఆర్‌బీకేలకుగానూ కంకిపాడు ఆర్‌బీకే ఇప్పటికే ప్రారంభమైంది. ప్రొద్దుటూరు ఆర్‌బీకే ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఇంకా పది ఆర్‌బీకేలు నిర్మాణంలోఉన్నాయి. వీటి నిర్మాణానికి ఒక్కో దానికి రూ 21.80లక్షలు కేటాయించారు. త్వరలోనే పూర్తి హంగులతో ఆర్‌బీకేలు అందుబాటులో రానున్నాయి.

గ్రామంలోనే ధాన్యం అమ్మాను



గతంలో కొనుగోలు కేంద్రం ఎక్కడ పెట్టారో అక్కడికి తీసుకెళ్లేవాళ్లం. లేకపోతే దళారులకు అమ్ముకునే వాళ్లం. ఆర్‌బీకేలు పెట్టాక ఇక్కడే ధాన్యం అమ్ముతున్నాం. గత ఖరీఫ్ సీజన్‌లో 3.60 ఎకరాలు సాగు చేసి ధాన్యం అమ్మాను. రూ.1.66 లక్షలు వచ్చాయి. ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర లభించింది. ఆనందంగా ఉంది.

– బొడ్డు ఏసుబాబు, రైతు, పునాదిపాడు

ఏటా రైతుభరోసా అందుతోంది



ప్రభుత్వం అమలు చేస్తున్న నాటి నుంచి రైతుభరోసా వస్తుంది. ఈ సొమ్ముతో సాగుకు అవసరమైన పెట్టుబడి సమకూర్చుకుంటున్నా. బయటి వ్యాపారులను ఆశ్రయించే అవసరం లేకుండా పోయింది. వ్యవసాయం పండుగలా మార్చేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి సంతోషంగా ఉంది.

– జి.మోహనరావు, కౌలురైతు, గొడవర్రు

రక్తదాతలను ప్రోత్సహించడమే లక్ష్యం

ఏపీసాక్స్ ఆధ్వర్యంలో ముగిసిన బ్లడ్‌సెంటర్ల కౌన్సిలర్ల శిక్షణ


కౌన్సిలర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ నాగేశ్వరరావు

గన్నవరం రూరల్: రక్తదాతలే.. ప్రాణదాతలనే నానుడి ఉంది. స్వచ్ఛందంగా రక్తదానం చేయాలనేకునేవారిని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. దీనికి చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీసాక్స్) ప్రాజెక్టు డైరెక్టర్ జె.నివాస్ ఆదేశాల మేరకు కృష్ణా జిల్లా గన్నవరం మండలం చిన్న అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో 5 రోజులుగా రాష్ట్రంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రుల, మెడికల్ కళాశాలల్లోని ప్రభుత్వ బ్లడ్ సెంటర్లలో పని చేస్తున్న కౌన్సిలర్‌లకు ఇస్తున్న శిక్షణ శనివారం ముగిసింది. మెడికల్ కళాశాల పాథాలజీ, బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ డిపార్ట్‌మెంట్‌లు, ఏపీసాక్స్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రొఫెసర్, హెచ్‌ఓడీ డాక్టర్ నవీన్ చంద్రరావు, ప్రొఫెసర్ వల్లభనేని కల్యాణ్ చక్రవర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు జాస్మిన్ సుల్తానా, ప్రణీత్ కౌన్సిలర్‌లకు మార్గదర్శనం చేశారు. శిక్షణలో ఎన్నో విషయాలను కొత్తగా నేర్చుకున్నట్లు కౌన్సిలర్‌లు చెప్పారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీపై అవగాహన, డ్రగ్ అండ్ కాస్మోటిక్ చట్టంపై సూచనలు తెలుసుకున్నట్లు వివరించారు. రక్తదాత నుంచి రక్తం సేకరించేటప్పుడు 107మార్గదర్శకాలు పాటించాలని చెప్పారన్నారు. రేర్ బ్లడ్ గ్రూపులు ఉన్న దాతల వివరాలను కంప్యూటీకరణ చేసి వారితో తరచూ మాట్లాడుతూ వారిని రిపీటెడ్ రక్తదాతలుగా తయారు చేసే పద్ధతులపై అవగాహన కలిగించారు.

రిపీటెడ్ దాతలను తయారుచేస్తాం



రక్తదానం చేసే వారికి ప్రాముఖ్యత ఇవ్వాలని, రక్తదాతలను రిపీటెడ్ డోనర్‌గా తయారు చేయడం నేర్పించారు. ఏపీసాక్స్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఇక్కడి ఫ్యాకల్టీ ఎంతో అద్భుతంగా వివరించారు. గతంలో తీసుకున్న శిక్షణకు మరిన్ని నూతన విషయాలు తెలియజేశారు.

–ఎం.సీతారామరెడ్డి, గుంటూరు జీజీహెచ్, బ్లడ్ సెంటర్ కౌన్సిలర్

ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి పనులు

రామవరప్పాడు: గ్రామంలో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్లు ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు తెలిపారు. గ్రామంలోని జెండా చెట్టు సెంటర్ నుంచి రైవస్ కాలువ వరకు మండల నిధులు రూ.57 లక్షలు, పంచాయతీ నిధులతో జరుగుతున్న రహదారి డబుల్ లైన్ నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఈ రోడ్డును 20 అడుగుల వెడల్పు, 540 మీటర్ల పొడవుతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 50శాతం పనులు పూర్తి అయ్యాయని, మిగతా పనులు త్వరలో ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. విద్యుత్ స్తంభాలు అడ్డుగా ఉన్నాయని వీటిని మరో చోటకు మార్పించి పనులు ప్రారంభించనున్నట్లు వివరించారు. పంచాయతీ నిధులు మరో 8లక్షలతో రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. కొండేటి కుమార స్వామి ఇంటి వద్ద నుంచి చిట్టిబొమ్మల అనురాధ ఇంటి వరకు మండల నిధులు రూ 2.50 లక్షలు, పంచాయతీ నిధులు లక్షతో రోడ్డు పనులు జరుగుతున్నట్లు తెలిపారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు


కంకిపాడు శాఖ గ్రంథాలయంలో క్యారమ్స్‌ఆడుతున్న చిన్నారులు

కంకిపాడు: వేసవి శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. కంకిపాడు, తెన్నేరు శాఖ గ్రంథాలయాల్లో శనివారం వేసవి శిబిరంలో భాగంగా క్యారమ్స్ శిక్షణ, పుస్తక పఠనం, చిన్నారులకు నృత్య శిక్షణ ఇచ్చారు. పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడంతో పాటు ఆసక్తి ఉన్న రంగాల్లో నిష్ణాతులను చేయడానికి శిక్షణ కొనసాగుతోందిది. శిక్షణ శిబిరాలను ఆయా గ్రంథాలయాధికారులు ఎస్.సునీత, సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షిస్తున్నారు.

గన్నవరం రూరల్: విద్యార్థుల్లో సృజనాత్మకతను వేసవి విజ్ఞాన శిబిరాలు వెల్లడి చేశాయని పురుషోత్తపట్నం శాఖ గ్రంథాలయం అధికారి కె.కృపానందం అన్నారు. సమ్మర్ క్యాంపులో భాగంగా స్థానిక గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు నీతి కథలు పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. ముస్తాబాద శాఖ గ్రంథాలయంలో అధికారి కె.జ్యోతికుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు.

శ్రీనివాసుని సన్నిధిలో అన్నప్రసాద వితరణ


అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లో వేంచేసి ఉన్న శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థాన కల్యాణ మండపంలో రెండు వేల మందికి భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయ ప్రాంగణంలో తొలుత పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణను నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ప్రారంభించి, అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కులమతాలకు అతీతంగా చిట్టినగర్, కొత్తపేట, ప్రైజర్‌పేట, విద్యాధరపురం ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అన్నదాన కార్యక్రమాన్ని దేవస్థాన పాలక మండలి అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, పొట్నూరి దుర్గాప్రసాద్, మజ్జి ఈశ్వరరావు, కామందుల నరసింహారావు, పిళ్లా విజయ్, పోతిన బేసు, మజ్జి శ్రీనివాసరావు, గూడెల రామకృష్ణ తదితరులు పర్యవేక్షించారు.

పాఠశాలలకు జగనన్న విద్యాకానుక



నున్న(విజయవాడరూరల్): పాఠశాలల పునఃప్రారంభం రోజే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక అందజేయడానికి ఏర్పాట్లు చేశారు. రూరల్ మండలంలోని 40 పాఠశాలల్లో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న జగనన్న విద్యాకానుకలు పంపిణీ చేస్తారని మండల విద్యాశాఖాధికారి ఆదూరి వెంకటరత్నం తెలిపారు. శనివారం నున్న జెడ్పీ హైస్కూల్లో స్టాకు పాయింట్ వద్ద ఎంఈఓ సిబ్బందితో కలిసి మండలంలోని వివిధ పాఠశాలలకు జగనన్న విద్యాకానుకల పంపిణీ ఏర్పాట్లు పరిశీలించారు. ఎంఈఓ వెంకటరత్నం మాట్లాడుతూ పాఠశాలల పునః ప్రారంభం రోజు 12వ తేదీ సోమవారం కానుకల కిట్లు పంపిణీ చేస్తామన్నారు. మండలంలో 36 మండల పరిషత్ పాఠశాలలు, 6 హైస్కూల్స్ ఉన్నాయని, వాటిలో 8,429 మంది విద్యార్థులున్నారని వివరించారు. నున్నలో స్టాకు పాయింట్ నుంచి మండలంలోని పాఠశాలలకు విద్యాకానుకలు చేరవేస్తున్నారు.

శ్రీక్షేత్ర హనుమత్‌పురానికి లక్ష విరాళం


చిక్కవరం ఆలయానికి లక్ష విరాళం అందజేస్తున్న డాక్టర్ పవన్

గన్నవరం రూరల్: చిక్కవరం శ్రీక్షేత్ర హనుమత్‌పురం ఆలయానికి శనివారం గన్నవరానికి చెందిన జాహ్నవి ఫిజియోథెరపీ ఆస్పత్రి ఎండీ డాక్టర్ జొన్నలగడ్డ పవన్ రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయానికి భూమి కొనుగోలు నిమిత్తం విరాళాన్ని ఆలయ నిర్వాహకులు చిట్టినేని వంశీకి అందజేశారు. దాతలు ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ రామకృష్ణ, కొలుసు రాంబాబు, వేమూరి రాంబాబు, భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా అందజేత

గన్నవరం: అల్లాపురంలో బ్రెయిన్ ట్యూమర్‌తో మరణించిన మన్నెం ఫణీంద్ర మట్టి ఖర్చుల నిమిత్తం వైఎస్సార్ బీమా పథకం ద్వారా రూ. 10 వేలు మంజూరయ్యాయి. సర్పంచి డొక్కు సాంబశివవెంకన్నబాబు చేతుల మీదుగా శనివారం నగదును మృతుడి సోదరి శ్రావణికి అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ మిగిలిన రూ.90 వేలు త్వరలో అతని కుటుంబ సభ్యుల బ్యాంక్ ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. ఉప సర్పంచ్ ఎ.శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఏఎస్ఆర్ కోటేశ్వరరావు, వార్డు సభ్యులు రాము, అచ్చియ్య, బాలశౌరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువ కవులను ప్రోత్సహించేందుకు కృషి

విజయవాడ కల్చరల్: యువ కవులలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడానికి నిరంతరం కృషి చేస్తున్నామని డాక్టర్ రాధేయ పురస్కార కమిటీ సభ్యుడు దోర్నాదుల సిద్ధార్థ అన్నారు. పురస్కార కమిటీ ఆధ్వర్యంలో బందరురోడ్డులోని బాలోత్సవ భవన్‌లో శనివారం యువకవి తెలుగు వెంకటేష్‌కు డాక్టర్ రాధేయ పురస్కార సభ, కవి సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించింది. దోర్నాదుల సిద్ధార్థ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో కృషి చేసి అనేక గ్రంథాలు రచించిన సాహితీ ప్రముఖుడు అధ్యాపకుడు డాక్టర్ రాధేయ పేరుతో 2010వ సంవత్సరంలో పురస్కారాలు ఇవ్వడం ప్రారంభించామన్నారు. నాటి నుంచి తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేసిన వారిని కమిటీ గుర్తించి వారికి పురస్కారాలు ప్రధానం చేస్తునట్లు తెలిపారు. 2023 సంవత్సరానికి గానూ కర్నూలుకు చెందిన తెలుగు వెంకటేష్‌కు డాక్టర్ రాధేయ పురస్కారం ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. సాహితీవేత్త కోసూరి రవికుమార్ వెంకటేష్ కవిత్వ విశేషాలను వివరించారు. నిర్వాహకులు తెలుగు వెంకటేష్‌కు పురస్కార ప్రదానం చేశారు. పురస్కార సభలో విద్యావేత్త బండ్ల మాధవరావు, రచయిత్రి డాక్టర్ వాడ్రేవు వీరలక్ష్మీదేవి, కవి విమర్శకులు డాక్టర్ రాధేయ పాల్గొన్నారు. యువ కవి అనిల్ డ్యానీ ఆధ్వర్యంలో వర్తమాన సమస్యలను ప్రస్తావిస్తూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు కవితా గానం చేశారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజనలో భాగంగా పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్ సొల్యూషన్స్, పంబ్లర్ కోర్సుల్లో విజయవాడలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలోనే శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన సర్టిఫికెట్‌ను అందజేస్తామని చెప్పారు. ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

నూతన విద్యావిధానంపై అవగాహన సదస్సు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న జనభాగిదారీ పక్షోత్సవాల్లో భాగంగా సత్యనారాయణపురం కేంద్రీయ విద్యాలయంలో శనివారం నూతన విద్యావిధానం - 2020 పై అవగాహన సదస్సు జరిగింది. కేంద్రీయ విద్యాలయం నంబర్ - 1 ప్రిన్సిపాల్ ఎంవీ రావు అధ్యక్షతన జరిగిన సదస్సులో కేంద్రీయ విద్యాలయం నంబర్ - 2 ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీఎస్ఎస్ఎస్ఆర్ కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని నూతన విద్యావిధానాన్ని వివరించారు. దేశ ప్రగతి కోసం పాటు పడే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దే విధానాలను వివరించారు. జనభాగిదారి కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే ఉపాధ్యాయులకు నూతన పద్ధతులపై కాలానుగుణంగా మార్పులను దృష్టిలో ఉంచుకుని చేపట్టాల్సిన విధానాలను వివరించారు. ప్రిన్సిపాల్ ఎంవీ రావు మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా విద్యాబోధన జరగాలన్నారు. విద్యార్థులు చదువు పట్ల ఆసక్తి కలిగించటానికి తీసుకోవాల్సిన విధానాలను తెలిపారు. జనభాగిదారీ కార్యక్రమాలు ఈనెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు క్విజ్, పోస్టర్ మేకింగ్, రంగోలి, స్లోగన్ తదితర సాంస్కృతిక కార్యక్రమాల్లో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు



పెనమలూరు: యనమలకుదురులో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రామంలోని సంజీవయ్యనగర్‌లో శ్రీలక్ష్మణ హనుమత్ సమేత శ్రీసీతారామస్వామి నూతన శిలా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం గ్రామంలో చేస్తున్నారు. రెండో రోజు శనివారం విష్వక్సేన పూజ, క్షీరాధివాసం, యాగశాల ఆరాధనలు తదితర పూజలు చేశారు.

స్విమ్మర్‌కు అభినందన



కంకిపాడు: స్విమ్మింగ్ పోటీల్లో ఈడుపుగల్లుకు చెందిన బిళ్లా హర్షిత సత్తా చాటింది. బ్లూమింగ్ డేల్ స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందుతున్న బిళ్లా హర్షిత ఈనెల 10న విజయవాడలోని జింఖానా గ్రౌండ్స్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన ఏపీ సీనియర్స్ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొంది. బ్యాక్‌స్ట్రోక్ 200 మీటర్ల విభాగంలో బంగారు పతకం, బటర్ ఫ్లైలో 200 మీటర్లలో రజతం, ఫ్రీస్టైల్‌లో 400 మీటర్లలో కాంస్య పతకాన్ని సాధించింది. సత్తా చాటిన హర్షితను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఝాన్సీలక్ష్మి ప్రత్యేకంగా అభినందించారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్

హనుమాన్‌జంక్షన్ రూరల్: వివాహితతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై హనుమాన్‌జంక్షన్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. బాపులపాడు మండలం వేలేరులో ఓ మహిళతో ఆమె ఇంటి సమీపంలో నివసిస్తున్న కొడాలి సువర్ణరాజు అసభ్యంగా ప్రవర్తించాడు. మహిళ కేకలు వేయడంతో సువర్ణరాజు పరుగులు తీశాడు. బాధితురాలు హనుమాన్‌జంక్షన్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఎస్‌ఐ ఏడీఎల్ జనార్దన్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు.

హత్యాయత్నం కేసులో ఆరుగురు నిందితులు అరెస్టు

పెనమలూరు: యనమలకుదురులో జరిగిన హత్యాయత్నం కేసులో ఆరుగురు నిందితులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురుకు చెందిన పఠాన్ జలీల్‌ఖాన్‌కు గోసాలకు చెందిన అబ్దుల్ ఖదీర్‌కు ఆర్థిక లావాదేవీల కారణంగా వివాదం ఉంది. ఈ నేపథ్యంలో గురువారం ఖదీర్, పఠాన్ ఫిరోజ్‌ఖాన్, ఎం.సాయికుమార్, అబ్దుల్‌వారిస్, ఎండీ అక్రమ్‌బాషా, అబ్దుల్ బాసిత్ ఆటోలో యనమలకుదురుకు వెళ్లి జలీల్‌ఖాన్‌ను బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని గ్రామ శివారుకు తీసుకువెళ్లి దాడి చేసి బీరు సీసాతో గాయపరిచారు. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేశారు.

వీరవల్లిలో యువకుడి ఆత్మహత్య

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సేకరించిన వివరాల ప్రకారం.. వీరవల్లికి చెందిన తొమ్మండ్రు చందు, ఇలపర్తి ఇంద్రలు తీన్‌మార్ డప్పు వాయిద్య బృందంలో కళాకారులు. ఈ నేపథ్యంలో వారం రోజుల క్రితం తొమ్మండ్రు చందుకు చెందిన ఐఫోన్ పోయింది. అంతేకాక అతని ఐఫోన్‌లో వినియోగించే ఫోన్‌పే అకౌంట్ నుంచి రూ.26 వేలు నగదు కూడా బదిలీ అయినట్లుగా బ్యాంకు స్టేట్‌మెంట్ ద్వారా చందు గుర్తించాడు. దీనిపై వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫోన్‌పే మనీట్రాన్స్‌ఫర్ వివరాల ఆధారంగా చందు స్నేహితుడు ఇలపర్తి ఇంద్ర (23)పై అనుమానం వ్యక్తం చేయటంతో పోలీసులు అతన్ని పిలిచి విచారణ చేశారు. పోలీసుల విచారణలో చందు ఐఫోన్‌ను దొంగిలించినట్లుగా ఒప్పుకున్న ఇంద్ర, ఆ ఫోన్‌ను కూడా ఇంట్లోనే దాచిపెట్టినట్లుగా వెల్లడించాడు. ఈ నేపథ్యంలో ఇంద్ర శనివారం గ్రామ శివారులోని చెరువు గట్టు వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడటం వీరవల్లిలో కలకలం రేపింది. తోటి డప్పు వాయిద్యకారుడి సెల్‌ఫోన్ దొంగిలించటం, అతని ఫోన్‌పే ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయటం వంటి ఘటనలు బహిర్గతం కావటంతో ఇంద్ర ఆత్మహత్యకు పాల్పడినట్లుగా భావిస్తున్నారు. ఘటనపై వీరవల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తింపు కార్డులివ్వాలి

గన్నవరం: భూ యాజమానితో సంబంధం లేకుండా కౌలుదారులకు కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆ సంఘ రాష్ట్ర నాయకులు మర్రాపు సూర్యనారాయణ కోరారు. రాష్ట్ర కౌలు రైతుల సంఘం చేపట్టిన ప్రచార జాత శనివారం గన్నవరం చేరుకుంది. సంఘ నేతలు టీవీ లక్ష్మణస్వామి, కైలే ఏసుదాసు, సూరగాని సాంబశివరావు, కళ్లం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు



కంకిపాడు: స్థానిక శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో పూజా కార్యక్రమాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో ఈనెల 12న జీవ ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠా మహోత్సవం, మహా కుంభాభిషేకం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. శనివారం విశేష పూజా కార్యక్రమాలతో ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠా మహోత్సవాలకు అంకురార్పణ చేశారు. అనంతరం గ్రామోత్సవం జరిపించారు. జీవధ్వజస్తంభాన్ని గ్రామవీధుల్లో ఊరేగించారు. పూజా కార్యక్రమాలను నిర్వాహక ప్రతినిధులు పర్యవేక్షించారు.

గంగూరులో పంట కాలువ పూడికతీత



పెనమలూరు: గంగూరులో పంట కాలువ పూడికతీత పనులు శనివారం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నేత అక్బర్‌బాషా వివరాలు తెలుపుతూ గ్రామంలో రైతులు పంటకాలువ పూడిక తీయాలని కోరారన్నారు. కాలువల్లో నీరు సక్రమంగా రాక పోవటంతో సాగు సమస్య ఎదురవుతోందని రైతులు తమ దృష్టికి తీసుకు వచ్చారన్నారు. పంచాయతీ సాధారణ నిధులు రూ.లక్షతో గ్రామంలోని ప్రధాన పంట కాలువలో పూడికతీత పనులు చేస్తున్నామన్నారు.